ప్రజాశక్తి
శనివారం 28 డిసెంబర్ 2024
5
అనంతపురం

సిపిఎం నాయకులపై కేసులు కొట్టివేత

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

2019 సంవత్సరంలో రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన రాష్ట్ర బంద్ ఆందోళనలో అనంతపురం మూడవ పట్టణ పోలీసులు సిపిఎం నాయకులపై అక్రమంగా పెట్టిన కేసును కోర్టు కొట్టివేసింది. ఎస్.నాగేంద్ర కుమార్, సి ప్రకాష్ రెడ్డి, జూటూరు రామాంజనేయులుపై పెట్టిన అక్రమ కేసులు ఐదు సంవత్సరాలకు పైగా అనంతపురం స్పెషల్ జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరిగింది. ఈ కేసులో సరైన సాక్షాదారులు లేకపోవడంతో అడ్వకేట్ జూటూరు సుధాకర్ రెడ్డి వాదనలు పరిగణలోకి తీసుకొన్న కోర్టు విచారణ అనంతరం నిర్దోషిలుగా ప్రకటించి కేసు కొట్టివేసింది. ఈ సందర్భంగా కోర్టు ఆవరణంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్ నాగేంద్ర కుమార్ మీడియాతో మాట్లాడారు. విభజన చట్టంలో ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని,రాష్ట్ర జిల్లా ప్రయోజనాలకు ఏ పాలకవర్గమైన ప్రజా వ్యతిరేక విధానాల అవలంబిస్తే ఖచ్చితంగా ప్రజాస్వామ్యబద్ధంగా సిపిఎం నిరంతరం ప్రజా పోరాటాల కొనసాగిస్తుందని చెప్పారు. కేసులకు భయపడే ప్రసక్తి లేదని అన్నారు.

ముంచుతున్న ముసురు

రైతుల్లో గుబులు
కమ్ముకొస్తున్న కారుమబ్బులు
కోత దశలో ముంచేస్తాయన్న ఆందోళన

ప్రజాశక్తి -అనంతపురం ప్రతినిధి

అల్పపీడన ప్రభావంతో పడుతున్న వర్షాలతో రైతుల్లో గుబులు నెలకొంది. రెండు రోజులుగా పడుతున్న వర్షాలు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. పంట చేతికొచ్చి నూర్పిడికి సిద్ధమవుతున్న సమయంలో కారుమబ్బులు కమ్ముకొస్తున్నాయి. జల్లాలో ఇప్పటి వరకు భారీ వర్షం ఏదీ నమోదకానప్పటికీ చిరుజల్లులు పడుతున్నాయి. ప్రధానంగా వరి, మొక్కజన్న, మిరప, పప్పుశనగ, పత్తి , కంది తదితర పంటలు కోత దశకు వచ్చి ఉన్నాయి. ఈ సమయంలో వర్షాలు పడితే పంట నాణ్యతపై ప్రభావం చూపే అవకశముందని రైతుల్లో ఆందోళన నెలకొంది.

హెచ్ఎల్సి ప్రధాన కాలువ కింద కణేకల్, బొమ్మనహాల్ మండలాల్లో వరిపంట కోతలు పూర్తయి కుప్పల దశలోనున్నాయి. ధాన్యం ఆరబోసిన సమయంలో వర్షమొస్తుండటంతో తడవకుండా ధాన్యాన్ని కాపాడుకోవడం రైతులకు ఇబ్బందికరంగా మారుతోంది. సుమారు 35 వేల ఎకరాల్లో ఈ ప్రాంతంలో వరి పండించి ఉన్నారు. ఇందులో సగానికిపైగా కోతలు పూర్తయి ఉండగా, మరికొన్ని కుప్పలు ఆరోబోసి ఉన్నాయి. దాన్ని రక్షించుకునేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక మిరప రైతుల్లో మరింత ఆందోళన నెలకొంది. గత నెలలోనూ వర్షాలతో మిరప పంటకు తెగుళ్ల వ్యాపించి ఉన్నాయి. ఇప్పుడు మరోమారు పడుతుండటంతో మరింతగా తెగుళ్ల వ్యాపించే ప్రమాదం ఉందని గుబులు చెందుతున్నారు. బొమ్మనహాల్, విడపనకల్లు, ఉరవకొండ, వజ్రకరూరు మండలాల్లో ఈ పంట సాగు అత్యధికంగా ఉంది. రబీలో పప్పుశనగ పంట జిల్లాలో 1.50 లక్షల ఎకరాల్లో సాగైంది. ఈ పంటకు కూడా తెగుళ్ల వ్యాపించి ఉన్నాయి. వర్షాలతో దిగుబడి తగ్గే అవకాశముంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తి పంటకు కూడా కొంత వరకు ప్రతికూల పరిస్థితులు నెలకొనే అవకాశముంది.

చిరు జల్లులు

అల్పపీడన ప్రభావంతో జిల్లా అంతటా చిరుజల్లులు పడుతున్నాయి.శుక్రవారం రోజు 16 మండలాల్లో తేలికపాటి వర్షపాతం నమోదయింది. ఈనెల సాధారణ వర్షపాతం 9.2 మిల్లీమీటర్లు అయితే ఇప్పటిదాకా 16.6 మిల్లీమీటర్లు నమోదయింది.శుక్రవారం ఒక్క రోజే 1.2 మిల్లీమీటర్లు నమోదయింది. అధిక వర్షపాతం కానప్పటికీ పంటలపై మాత్రం తీవ్ర ప్రభావం చూపనుంది.

బొమ్మనహాల్ మండలంలో వరిధాన్యంపై టార్పాలిన్ పట్టలు కప్పిన రైతులు

మోసానికి బ్రాండ్ అంబాసిడర్ 'బాబు'

ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు, కార్యకర్తలు

చంద్రబాబు పాలనలో బాదుడు గ్యారంటీ
వైసీపీ జిల్లా అధ్యక్షులు అనంతవెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

అధికారం కోసం ప్రజలను నమ్మించడం.. సీఎం కుర్చీలో కూర్చోగానే మోసం చేయడం చంద్రబాబుకు అలవాటేనని, మోసానికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి విమర్శించారు. విద్యుత్ ఛార్జీల బాదుడుపై శుక్రవారం వైఎస్ఆర్సీపీ పోరుబాట నిర్వహించింది. నగరంలోని పాతూరులో ఉన్న బ్రహ్మం గారి గుడి వద్ద నుంచి పవర్ ఆఫీస్ వరకు పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో మభ్యపెట్టారని, అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడిచినా హామీలు అమలు చేయడం లేదని విమర్శించారు. గత ఎన్నికలకు ముందు కరెంట్ చార్జీలను పెంచను.. తగ్గిస్తానని చెప్పిన చంద్రబాబు ఆరు నెలల్లోనే ఏకంగా రూ.15,485 కోట్ల భారాన్ని మోపారన్నారు. చంద్రబాబు పాలన.. చంద్రబాదుడు పాలనగా మారిందని విమర్శించారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయని, ఆదాయ మార్గాలు కూడా లేకపోవడంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో చంద్రబాబు చెప్పిన 'బాబు ష్యూరిటీ -భవిష్యత్ గ్యారంటీ' ఏమో గానీ ఇప్పుడు 'బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారంటీ'గా మారిపోయిందని ఎద్దేవా చేశారు. ఎన్నికలకు ముందు సంపద సష్టిస్తానని చంద్రబాబు చెప్పారని, దానర్థం పేదలపై రూ.15 వేల కోట్ల కరెంట్ చార్జీల భారం మోపడమా? అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తక్షణం కరెంట్ చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలని అనంత వెంకటరామిరెడ్డి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ర్యాలీ అనంతరం ఎస్పీడీసీఎల్ ఎస్ఈ సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు నివాళి :దేశ మాజీ ప్రధానమంత్రి డాక్టర్ మన్మోహన్‌సింగ్ మృతికి వైసీపీ అనంతపురము జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ప్రజాప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ చేపట్టిన ర్యాలీకి ముందు బ్రహ్మం గారి గుడి సమీపంలో డాక్టర్ మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ దేశం ఓ మహోన్నత వ్యక్తిని కోల్పోయిందని తెలిపారు. మన్మోహన్‌సింగ్ ప్రధానిగా ఉన్న సమయంలోనే ఉపాధి హామీ పథకం రూపుదిద్దుకుందని, శింగనమల నియోజకవర్గం బండ్లపల్లిలో ఈ పథకం ప్రారంభించారనితెలిపారు. అదేవిధంగా సామాన్యుడి చేతిలో పాశు పతాస్త్రంగా మారిన సమాచార హక్కు చట్టం కూడా మన్మోహన్ సింగ్ హయాంలోనే వచ్చిందని గుర్తు చేశారు. ఆయన మరణం దేశానికి తీరనిలోటు అని అన్నారు.

ట్రూ అప్ ఛార్జీల భారం జగన్ రెడ్డిదే

టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్

విలేకరులతో మాట్లాడుతున్న టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడుయాదవ్

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

విద్యుత్‌ఛార్జీల భారం జగన్‌రెడ్డిదే అని టిడిపి జిల్లా అధ్యక్షులు వెంకటశివుడు యాదవ్, ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విమర్శించారు. ఈ మేరకు వారు అనంతపురములోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాను పెంచిన విద్యుత్ చార్జీలపై తానే ధర్నాకు పిలుపునివ్వడం విడ్డూరంగా ఉందన్నారు. సిఎంగా జగన్ చేసిన పాపాలే ప్రజలకు శాపాలుగా మారాయన్నారు. విద్యుత్ ఛార్జీలు పెంచాలని జగన్ రెడ్డి రెండేళ్ల క్రితమే ఈఆర్సీని ఆదేశించారన్నారు. ఇప్పుడు ప్రజలను తప్పుదోవ పట్టించేలా కూటమి ప్రభుత్వంపై దొంగ ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. 2019 లో తెలుగుదేశం పార్టీ అధికారంలో కోల్పోయేనాటికి రాష్ట్రాన్ని మిగులు విద్యుత్ రాష్ట్రంగా జగన్ మోహన్ రెడ్డికి అప్పగిస్తే... ఐదేళ్లలో అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడని విమర్శించారు. పీపీఏలను రద్దు చేయడంతో పాటు సోలార్, విండ్ పెట్టుబడిదారులను బెదిరించి వారిని రాష్ట్రం నుంచి వెళ్లగొట్టి 10 వేల మెగా వాట్ల పునరుత్పాదక విద్యుత్ ను మన రాష్ట్రం కోల్పోయేలా చేశారని ఆరోపించారు. ప్రజల విద్యుత్ అవసరాలు అనే పేరు చెప్పి విచ్చల విడిగా విజయసాయి రెడ్డి అండ్ కో నుంచి అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేసి విద్యుత్ రంగ నాశనానికి పునాది వేసిన ఘనత జగన్‌కే దక్కుతుందని ఎద్దేవా చేశారు. యూనిట్ ధర రూ. 5కు అందుబాటులో ఉన్నాకమీషన్ల కోసం బహిరంగ మార్కెట్ లో యూనిట్ ను రూ. 8 నుంచి రూ. 14 వరకు జగన్ రెడ్డి అండ్ బ్యాచ్ కొనుగోలు చేసిందని విమర్శించారు. జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతిపాదించిన విద్యుత్ చార్జీల పెంపుపై ఇప్పుడు అదే పార్టీ నాయకులు ధర్నాలు చేయాలని జగన్ పిలుపునివ్వడం తుగ్లక్ చేష్టలేనని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, ప్రచార కార్యదర్శి కూచి హరి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గంజే నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ వసూళ్లలో అధికారుల చేతివాటం

విజిలెన్స్ అధికారుల తనిఖీతో హడావుడిగా సమావేశం
అక్రమార్కుల్లో మొదలైన గుబులు

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామలింగేశ్వర్

ప్రజాశక్తి అనంతపురం కార్పొరేషన్

అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ ఫీజు వసూళ్ల వ్యవహారంలో కొంతమంది అధికారుల చేతివాటంతో కార్పొరేషన్ ఆదాయానికి గండి పడుతోంది శుక్రవారం విజిలెన్స్ శాఖ అధికారులు నగరంలో ట్రేడ్ లైసెన్స్ వసూళ్ల వ్యవహారంపై వ్యాపారస్తుల వద్దకు వెళ్లి ఆరా తీయడంతో మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, హెల్త్ ఆఫీసర్, సచివాలయ శానిటరీ సెక్రటరీలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు కొంతమంది అధికారులు ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల వ్యవహారంలో భారీ ఎత్తున చేతివాటం ప్రదర్శించారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. 2019 -20 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రస్తుత 2024 -2025 వరకు పెద్ద ఎత్తున ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లు జరిగినప్పటికీ అధికభాగం అధికారుల జేబులోకి వెళ్లిందన్న చర్చ నడుస్తోంది. దీనికి తగ్గట్టుగానే గడచిన ఆరు ఆర్థిక సంవత్సరాల కాలవ్యవధిలో బార్లు, హోటళ్లఇతర వ్యాపార సముదాయాల నుంచి వసూలైన ఫీజుల జాబితాను సచివాలయ శానిటరీ ఇన్స్‌పెక్టర్లు ఆయా సంవత్సరాలల్లో హెల్త్ ఆఫీసర్లకు అందజేశారు. అయితే ఆ ఫీజుల జాబితా వివరాలకు మున్సిపల్ కార్పొరేషన్‌లోని వివరాలకు భారీ వ్యత్యాసం ఉన్నట్టు తెలుస్తోంది. బార్ల లైసెన్సులు ఒక ఏడాది వారికి నిర్దేశించిన ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లించకుంటే సంవత్సరానికి 5వేల రూపాయల జరిమానా విధించబడుతుంది అయితే వారి నుంచి వసూలైన మొత్తాలు కార్పొరేషన్ ఖజానాకు జమ చేయకుండా స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. బార్లు, హోటళ్ల పేర్లు మార్చి యాజమాన్యం మార్పుతో వసూలు చేయడం వల్ల వారి నుంచి పాత బకాయిలు వసూలు చేసే అవకాశం లేనట్టుగా ఉద్యోగ వర్గాలు చర్చించుకుంటున్నాయి. నగరంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 10,115 ట్రేడ్ లైసెన్స్ ఫీజుల అసెస్మెంట్‌లు ఉన్నట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్ల శాతం 2019 - 20 నుంచి 2024 25 వరకు పరిశీలిస్తే ప్రతి సంవత్సరం 50శాతం మాత్రమే వసూలు చేసినట్లు అధికార గణాంకాలు చెబుతున్నాయి. దీని అర్థం ప్రతి సంవత్సరం 50శాతం ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లకే పరిమితమైనట్లు అధికార గణాంకాలు తెలియజేస్తున్నాయి. దీనితో అరియర్స్ గడిచిన ఆరు సంవత్సరాల నుంచి ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ.3.94 కోట్లకు చేరటం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వం వందశాతం ఆస్తిపన్ను, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లను సాధించాలని పదేపదే చెప్పుతున్నా మున్సిపల్ కార్పొరేషన్ అధికార గణం సన్నాయి నొక్కులు నొక్కుతూ ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఇదిలా ఉండగా ప్రజారోగ్య విభాగం అవినీతికి అడ్డాగా మారడంతో లైసెన్స్ ఫీజుల వసూళ్ల సొమ్ము వారి జేబులలోకే వెళ్తోందన్న ఆరోపణలకు బలం చేకూరేలా అధికార గణాంకాలు స్పష్టతనిస్తున్నాయి. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లను ఆన్‌లైన్ చేయించారు. అయితే సిబ్బంది క్షేత్రస్థాయిలో వసూలు చేసిన మొత్తాలను చేతి రసీదును వ్యాపార వర్గాలకు అందజేసి ఆన్‌లైన్‌లో వాటిని నమోదు చేయకపోవడంతో చెల్లింపులు జరిపిన వ్యాపార వర్గాలు ట్రేడ్ లైసెన్స్ ఫీజుల చెల్లింపులు జరపనట్లుగా వివరాలు చూపుతున్నాయి. ఈనేపథ్యంలో ప్రజారోగ్య విభాగాధికారుల గోల్‌మాల్ వ్యవహారాలను నిగ్గు తేల్చడానికి విజిలెన్స్ అధికారులు రంగంలోకి దిగటం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు వణుకు పుట్టిస్తోంది. శుక్రవారం నగరంలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేపట్టడంతో మున్సిపల్ అధికారుల్లో దడ మొదలైంది. విజిలెన్స్ తనిఖీలతో తమ అవినీతి అక్రమాల వ్యవహారం ఎక్కడ బయట పడుతుందోన్న భయం వారిని వెన్నాడుతోంది. దీంతో నగరంలోని 74 సచివాలయ శానిటరీ ఇన్స్‌పెక్టర్లను సమావేశపరిచి టీములుగా ఏర్పాటు చేసి ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లను శనివారం నుంచి చేపట్టాలని కమిషనర్ రామలింగేశ్వర్ ఆదేశించారు. అయితే గడిచిన ఆరు సంవత్సరాల్లో వసూలు చేసి కార్పొరేషన్ ప్రజారోగ్య అధికారులకు అందజేసిన ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వివరాలను బహిర్గతం చేస్తేనే అధికారుల అవినీతి అక్రమాలు వెలుగు చూసే అవకాశం ఉంది.కార్పొరేషన్ అధికారులు హడావుడిగా టీంలు ఏర్పాటు చేసి వ్యాపార వర్గాల వద్దకు వెళ్లి ట్రేడ్ లైసెన్స్ ఫీజుల అరియర్స్ చెల్లింపులు జరపాలని కోరితే వారు అధికారులు వసూలు చేసి అందజేసిన చేతి రసీదు చూపితే తమ పరిస్థితి ఏమిటని హెల్త్ ఆఫీసర్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. విజిలెన్స్ అధికారుల తనిఖీతో తమ అవినీతి బండారం బయటపడితే ప్రస్తుత తెలుగుదేశం ప్రభుత్వం క్రమశిక్షణ చర్యల కింద సస్పెండ్ చేస్తే తమ భవితం ఏమిటన్న ఆందోళన వీరిని వెంటాడుతోంది. ఈ అంశానికి సంబంధించి ఇప్పటికే తెలుగుదేశం ప్రభుత్వానికి, మున్సిపల్ పరిపాలన శాఖ డైరెక్టరేట్‌కు ఫిర్యాదులు అందినట్లు సమాచారం.

గంజాయి విక్రయించే ముఠా అరెస్టు

4,270 గ్రాముల గంజాయి, 10 సెల్‌ఫోన్లు స్వాధీనం

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

గంజాయి విక్రయించే 10 మందిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 4,720 గ్రాముల గంజాయి, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. స్థానిక ఆర్వీ నాయుడు కాలనీకి చెందిన తాడిపత్రి సయ్యద్ ముహమ్మద్ నవాజ్ మహారాష్ట్రలోని సోలాపూర్, కురువాడి రైల్వే స్టేషన్ల పరిసరాలలో గంజాయిని కొనుగోలు చేసి అక్కడి నుండి రైళ్లలో అక్రమంగా తరలించి అనంతపురం, శివారు ప్రాంతాలలో గంజాయి సేవకులు, వ్యసనపరులైన విద్యార్థులకు అధిక ధరలతో విక్రయించేవాడు. ఈక్రమంలో ఇతనికి అనంతపురం హెచ్చెల్సీ కాలనీకి చెందిన గౌస్ మొహిద్దిన్ అలియాస్ తొత్తి, ఎర్రనేల కొట్టాలకు చెందిన ఎర్రోళ్ల జశ్వంత్ అలియాస్ బిట్టు, లెక్చరర్స్ కాలనీకి చెందిన కడవకల్లు మురళీధర్ అలియాస్ చింటు, ఉమానగర్‌కు చెందిన షేక్ మహమ్మద్ గౌస్ అలియాస్ పిట్టు, వన్నం తేజస్వరూప్, నీరుగంటి వీధికి చెందిన వెంకటేశ్, సత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన మామిళ్ల రాజేష్ కుమార్, కట్టుబడి మురళీ, ఒక మైనర్ పరిచయమయ్యారు.ఈ 10 మంది గంజాయి ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ముగ్గురు సరుకు తీసుకురావడం, ఆ సరుకును భాగాలుగా చేసుకుని అనంతపురం నగర శివారు ప్రదేశాలలో విక్రయించడం లాంటివి చేసేవారు. ఇందులో ఎవరి లాభం వారిది.వీరు మహారాష్ట్రలోని సోలాపూర్, కురువాడి రైల్వే స్టేషన్ల పరిసరాలలో కిలో గంజాయి రూ 15 వేలుకు కొనుగోలు చేసి ఇక్కడికి అక్రమంగా తీసుకొచ్చాక 6 గ్రాముల పొట్లాలుగా ప్యాక్ చేసుకుని ఒక్కోటి రూ 500 ప్రకారం విక్రయిస్తుంటారు. ఇలా కిలో గంజాయిని రూ . 83,000 అమ్ముకుంటున్నట్లు విచారణలో వెల్లడయ్యింది. ఈ 10 మంది ముఠాలో వెంకటేష్ పై ఇదివరకే అనంతపురం ఒన్ టౌన్ పోలీసు స్టేషన్లో గంజాయి కేసు ఉంది. గంజాయి ముఠాపై పక్కాగా రాబడిన సమాచారం మేరకు బుక్కరాయ సముద్రం సి.ఐ కరుణాకర్, ఇన్చార్జీ సి.ఐ హేమంత్ కుమార్ , టాస్క్ ఫోర్స్ ఎస్సై రాజశేఖర్ రెడ్డి ఈ ముఠాను అరెస్టు చేసి 4,270 గ్రాముల గంజాయి, 10 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గంజాయి సేవించినట్లు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేలా ఈ ముఠా సరఫరా చేస్తున్న గంజాయితో పాటు సేవించేందుకు ఖాళీ ఓసిలు, మౌత్ ఫ్రెషనర్స్,కళ్లు ఎర్రబడకుండా ఉండేందుకు వాడే ఐ డ్రాప్స్ ను సీజ్ చేశారు. ఈ ముఠాలోని మైనర్‌ను సీడబ్ల్యూసీ ముందు హాజరు పరచనున్నట్లు ఎస్పీ తెలిపారు.

గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్

మత్తుపదార్థాల జోలికెళ్లి జీవితాలు నాశనం చేసుకోవద్దు

గంజాయి, తదితర మాదకద్రవ్యాలకు బానిసలై కొంత మంది యువత తమ భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, క్షణకాలం ఆనందం కోసం నూరేళ్ల జీవితంలోని వెలుగును దూరం చేసుకోవద్దని జిల్లా ఎస్పీ సూచించారు. జిల్లాలో మాదక ద్రవ్యాలు విక్రయించి సొమ్ము చేసుకుందామని ఎవరైనా అమాయక ప్రజలు, యువకులు, విద్యార్థుల జీవితాలను చీకటిమయం చేయాలని చూస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై విద్యార్థులు, ప్రజల్లో జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. అక్రమ మాదకద్రవ్యాలు రవాణా చేసిన, విక్రయించినా, సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. జిల్లాలో ఎవరికైనా గంజాయి మరియు మాదకద్రవ్యాలపై సమాచారం ఉంటే వెంటనే లీగల్ ట్రోల్ ఫ్రీ నెంబర్ 1972 కు లేదా స్థానిక పోలీసులకు లేదా డయల్ 100 లేదా 112 కు తెలియజేయాలని ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ తెలిపారు.

నార్పల పోలీస్‌స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను డీఎస్పీ వెంకటేశ్వర్లు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పలు రికార్డులు, రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత మండలంలో నేరాల సంఖ్య, పురోగతిపై స్థానిక ఎస్ఐ సాగర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశులు మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా నార్పల పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ నాగరాజు, హెడ్ కానిస్టేబుళ్లు చలపతి, జయకుమార్, శివ, జాఫర్, దేవకుమార్, పోలీస్‌సిబ్బంది అమర్, రాము, హరి, సుంకన్న, భార్గవ్, రాజు, షాన్వాజ్, రామాంజనేయులు, మసూద్, మైనుద్దీన్, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

అల్ట్రాటెక్ యాజమాన్యానికి క్షమాపణలు..

డబ్బు కోసం కాదు..ప్రతిష్ట కోసం
తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ : జేసీ ప్రభాకర్‌రెడ్డి

ప్రజాశక్తి -అనంతపురం

అల్ట్రా టెక్ యాజమాన్యానికి తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి.ప్రభాకర్‌రెడ్డి క్షమాపణలు చెప్పారు. శుక్రవారం అనంతపురం నగరంలోని ఆయన నివాసంలో మీడియాతో మాట్లాడారు. గత కొంత కాలంగా ఫ్లైయాస్ విషయంలో జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి, జేసీకి వధ్య వివాదం నడుస్తోంది. ఈ వివాదం నడుమ సిమెంటు పరిశ్రమకు అవసరమైన ఫ్లైయాస్ రావడంలో సమస్య తలెత్తుతూ వచ్చింది. పరస్పరం వాహనాలపై దాడులు చేసుకునే వరకు వెళ్లిఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రభాకర్‌రెడ్డి శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తాను డబ్బు కోసం గొడవ పడలేదని, ప్రతిష్ట కోసమని చెప్పారు. తమకు ఎందుకు అవకాశం లేదన్నదే అడుగుతున్నా అని చెప్పారు. ఈ విషయమై అనంతపురం రేంజ్ డిఐజి, కర్నూలు రేంజ్ డిఐజలతోపాటు అనంతపురం, కడప జిల్లాల ఎస్పీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని చెప్పారు. తన భార్య, కుమారుల సూచన మేరకు తాడిపత్రి ప్రాంత ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని వివాదాన్ని సద్దుమణిచేందుకు తాను అల్ట్రాటెక్ యాజమాన్యానికి క్షమాపణలు చెబుతున్నానని వెల్లడించారు.

మాట్లాడుతున్న జెసి ప్రభాకర్‌రెడ్డి

ధాన్యం సేకరణకు అనుమతివ్వాలని సిఎంకు వినతి

ప్రజాశక్తి-రాయదుర్గం

వెనుకబడ్డ అనంతపురం జిల్లాలో కనీసం 20వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు అనుమతి ఇవ్వాలని విప్ కాలవ శ్రీనివాసులు కోరారు. ఈమేరకు సిఎం చంద్రబాబుకు శుక్రవారం లేఖ పంపారు. లేఖలో పంపిన వివరాల మేరకు... నిత్యం రైతు సంక్షేమం గురించి ఆలోచించే సిఎం చంద్రబాబు కష్టకాలంలో వారికి మద్దతుగా నిలుస్తుండటం ఎంతో సంతోషకరమన్నారు. మద్దతు ధర చెల్లించి రాష్ట్రంలో ధాన్యం సేకరణకు అనుమతి ఇవ్వటమే కాక, కొనుగోలు చేసిన 48 గంటల్లోనే సంబంధిత రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా డబ్బు జమ చేయడం సంతోషకరమన్నారు. జిల్లాలో ఇప్పటిదాకా 7,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు మాత్రమే సివిల్ సప్లయ్ అధికారులకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. అయితే జిల్లాలో ఈ ఏడాది సుమారు 37500 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ఉత్పత్తి చేశారన్నారు. ఇందులో 80 శాతం రాయదుర్గం నియోజకవర్గ పరిధిలోని కణేకల్లు, బొమ్మనహాల్ మండలాల్లోనే రైతులు పండిస్తున్నారన్నారు. రైతులందరికీ ప్రయోజనం చేకూరేలా ప్రస్తుతం సేకరిస్తున్న 7500 టన్నులతో పాటు అదనంగా మరో 12,500 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సివిల్ సప్లయ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు.

శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

విద్యుత్ ఛార్జీలు తగ్గించాల్సిందే..

నియోజకవర్గ కేంద్రాల్లో వైసిపి నిరసనలు

ప్రజాశక్తి-శింగనమల

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. వైసిపి అధినేత జగన్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద వైసిపి నాయకులు నిరసనలు తెలిపారు. ఇందులో భాగంగా భారీ ర్యాలీలు నిర్వహించి విద్యుత్ అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శింగనమల నియోజకవర్గ కేంద్రంలో వైసిపి నేత ఆలూరు సాంబశివారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్‌ఆర్ విగ్రహం నుంచి కరెంటు ఆఫీస్ వరకూ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సాంబ శివారెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అధికారం చేపట్టిన కూటమి నాయకులు ప్రజలను ఇబ్బందులకు గురి చేయడం మంచిది కాదన్నారు. ముఖ్యంగా ఎన్నికల ముందు కరెంటు ఛార్జీలు పెంచమని చెప్పి సిఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన మూడునెలల్లోపే ప్రజలపై దాదాపు 15వేల కోట్ల విద్యుత్ భారాలు మోపడం బాధాకరమన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం విద్యుత్ శాఖ ఎఇ విజయకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త ఎం.వీరాంజనేయులు, నాయకులు బొమ్మన శ్రీరామిరెడ్డి, శేఖర్‌రెడ్డి, కంచిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చాగంటి గురుమూర్తిరెడ్డి, మురార్జి, బొమ్మన గోపాల్‌రెడ్డి, గార్లదిన్నె నరేందర్‌రెడ్డి, శ్రీరామ్‌రెడ్డి, మిద్దె కుళ్లాయప్ప, మడుగుపల్లి జయన్న, సరోజమ్మ, నాగన్న, కాటమయ్య, పార్వతి, యోగేశ్వర, ఎస్‌ఎన్.నారాయణ పాల్గొన్నారు.

రాప్తాడు : విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ మాజీ సిఎం జగన్ ఆదేశాల మేరకు వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలపూ రూ.15వేల కోట్ల విద్యుత్ ఛార్జీలు మోపడం బాధాకరమన్నారు. వెంటనే విద్యుత్ ఛార్జీలను ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అంతకుముందు వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడి నుంచి ర్యాలీగా విద్యుత్ కార్యాలయానికి చేరుకుని విద్యుత్ శాఖ ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్లు, ఎంపిపిలు, జడ్పిటిసిలు, వైస్ ఎంపిపిలు, సర్పంచులు పాల్గొన్నారు.

రాయదుర్గం : పెంచిన విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో శుక్రవారం రాయదుర్గంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని వినాయక కూడలి నుంచి ప్రధాన రహదారుల మీదుగా కణేకల్ రోడ్డు వద్ద ఉన్న విద్యుత్ సంస్థ కార్యాలయం వరకూ నిర్వహించారు. అక్కడ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ బాలచంద్రకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మెట్టు గోవిందరెడ్డి, రాయదుర్గం పురపాలక సంఘం అధ్యక్షులు పొరాళ శిల్ప, మాజీ అధ్యక్షులు గౌని ఉపేంద్రరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు ఉషారాణి, భోజరాజనాయక్, మాజీ ఎంపిపి రాజగోపాల్‌రెడ్డి, మాజీ జడ్పిటిసి నాగిరెడ్డి, గుమ్మఘట్ట మండల కన్వీనర్ లక్ష్మీకాంతరెడ్డి, యువ నాయకులు మెట్టు విశ్వనాథరెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బిటిపి గోవిందు, బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.టి సిద్దప్ప, శ్రీనివాసులు, మున్సిపల్ వార్డ్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి : పెంచిన విద్యుత్ ఛార్జీలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మాజీ సిఎం జగన్ పిలుపుమేరకు వైసిపి నాయకులు శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్ సర్కిల్‌లో నిరసన తెలిపారు. అనంతరం ర్యాలీగా విద్యుత్ కార్యాలయానికి చేరుకుని మండల ట్రాన్స్‌కో ఎఇ రాజారామ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు బొంబాయి రమేష్‌నాయుడు, ఉపసర్పంచ్ కాసా చంద్రమోహన్, ఎంపిటిసి బొంబాయి బ్రదర్ వెంకటనాయుడు, అవుకు నాగరాజు, గొడ్డుమర్రి రామమోహన్, పామిశెట్టి నాగరాజు, వార్డుసభ్యులు గుంత తిరుపతి, మేకల రామచంద్ర, గజ్జి బాలపెద్దయ్య, పేరం పరమేశ్వరరెడ్డి, దాసరి శ్రీధర్, మండల ప్రధాన కార్యదర్శి కోట చౌదరి, మండల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉరవకొండలో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ, నాయకులు

కళ్యాణదుర్గం : సిఎం చంద్రబాబు ఆరు నెలల పాలనలోనే జనం సతమతం అవుతున్నారని కళ్యాణదుర్గం వైసిపి సమన్వయకర్త తలారి రంగయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ పట్టణంలోని వైసిపి కార్యాలయం నుంచి ర్యాలీగా విద్యుత్ శాఖ కార్యాలయానికి చేరుకుని నిరసన తెలిపారు. అనంతరం విద్యుత్ డిఇ గురురాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఉమామహేశ్వరనాయుడు, తిప్పేస్వామి, జడ్పిటిసిలు మంజునాథ్, బొమ్మన నాగరాజు, ఎంపిపిలు మారుతమ్మ, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి గోళ్ల సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉరవకొండలో వైసిపి ఆందోళన చేపట్టింది. ఇందులో భాగంగా పట్టణంలోని ఊరిగాధ్రి కళ్యాణ మండపం నుంచి విద్యుత్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆందోళన చేపట్టి విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు, కార్మికులు

పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నిరసన

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపాలిటీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు, ఎఐటియుసి నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు, ఎఐటియుసి నాయకులు వీరభద్రస్వామి, కె.నరసయ్య, జగదీష్, ఈశ్వరయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. ప్రస్తుత కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మున్సిపాలిటీల్లో పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి నిలుపుకోలేకపోతున్నారన్నారు. చేసేది లేక నిరసనలు తెలియజేయాల్సి వస్తోందన్నారు. వెంటనే కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో నిరసనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మున్సిపల్ కమిషనర్ అందుబాటులో లేకపోవడంతో వినతిపత్రాన్ని ఛాంబర్‌కు అతికించారు. నిరసనకు సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బి.శ్రీనివాసులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల నాయకులు సాకే నాగరాజు, మారుతీప్రసాద్, షబ్బీర్, దాను, చిన్న, ఏసు, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి దాసరి సునీత

మండల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి దాసరి సునీత అధ్యక్షతన శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలన్నారు. అలాగే గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. నీటి సరఫరాపై శ్రద్ధ వహించాలని కోరారు. ఇకపోతే మండలంలో చేపట్టిన రోడ్లు, కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సొలమన్‌రాజ్, తహశీల్దార్ పుణ్యవతి, హౌసింగ్ డిఇ రామ్మూర్తి, ఇఒఆర్‌డి సదాశివ, ఎపిఎం నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

దేహదారుఢ్య పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు : ఎస్పీ

ఎస్పీ పి.జగదీష్

నీలం సంజీవరెడ్డి స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ పి.జగదీష్

ప్రజాశక్తి-అనంతపురం క్రైం

పోలీసు కానిస్టేబుల్ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని ఎస్పీ పి.జగదీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగ అభ్యర్థులకు ఈనెల 30 నుంచి జనవరి 17వతేదీ వరకూ నగరంలోని నీలం సంజీవరెడ్డి మైదానంలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ పరీక్షలకు 6,479 మంది హాజరు కానున్నారు. ఈమేరకు దేహదారుఢ్య పరీక్షలు జరిగే నీలం సంజీవరెడ్డి మైదానాన్ని శుక్రవారం సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎలాంటి అవరోధాలు లేకుండా పూర్తి పారదర్శకంగా నిర్వహించేలా ఏర్పాట్లుండాలన్నారు. హై స్పీడ్ ఇంటర్నెట్, అడ్వాన్స్ సిస్టమ్స్ మరియు ప్రింటర్స్‌ను సమకూర్చుకొని వెరిఫికేషన్ ప్రక్రియ మొత్తం సజావుగా జరిగేలా చూసుకోవాలని సూచించారు. నియామక ప్రక్రియ యావత్తు సీసీటీవీ కెమెరాల పర్యవేక్షణలో జరిగేలా చర్యలుండాలని పరీక్షలు నిర్వహించే ప్రతి ప్రదేశం సీసీ కెమెరా పర్యవేక్షణ ఉండేలా ఖచ్చితమైన ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులు నీలం సంజీవరెడ్డి మైదానంలోకి అడుగుపెట్టిన దగ్గర్నుంచి ఎవరికి ఎలాంటి కన్ఫ్యూజన్ లేకుండా డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఫిజికల్ మెజర్మెంట్ టెస్టు (పిఎంటి), ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్ (పిఇటి) జరిగే అన్ని ప్రదేశాలను సూచించే విధంగా నేమ్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రన్నింగ్ ట్రాక్ మొత్తం తిరిగి ఇంకా చేయాల్సిన పనుల గురించి దిశానిర్దేశం చేశారు. అభ్యర్థులకు మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, వైద్య సదుపాయం, ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. అదేవిధంగా వారి వెంట తెచ్చుకునే బ్యాగులు, సెల్ ఫోన్లు భద్రపరిచి తిరిగి వెళ్లే సమయంలో అందజేయాలన్నారు. సెన్సార్ ద్వారా జరిగే ప్రక్రియ మొత్తం సైంటిఫిక్‌గా ఎలాంటి అవరోధాలు లేకుండా చూసుకోవాలని, మ్యాన్యువల్‌గా జరిగే ప్రదేశంలో పూర్తి పారదర్శంగా నిర్వహించాలని తెలిపారు. రిక్రూట్మెంట్‌లో పాల్గొనే సిబ్బంది, అధికారులు తెల్లవారుజామున 4 గంటలకే విధుల్లో ఉండాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు డివి.రమణమూర్తి, ఇలియాజ్ బాషా (ఎఆర్), అనంతపురం డీఎస్పీ శ్రీనివాసరావు, ఎఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వర్‌రెడ్డి, జిల్లా పోలీసు కార్యాలయం పరిపాలనాధికారి రఘురామ్‌నాయక్, సంబంధిత రిక్రూట్‌మెంట్ విభాగం క్లర్క్ నందకుమార్, సిఐలు కనుమూరి సాయినాథ్, జయపాల్‌రెడ్డి, ఆర్‌ఐలు రెడ్డెప్పరెడ్డి, రాముడు, మధు, తదితరులు పాల్గొన్నారు.

నార్పల మండలం బండ్లపల్లిలో సోనియాగాంధీ, రాజశేఖర్‌రెడ్డితో కలిసి భోజనం చేస్తున్న మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్

మన్మోహన్‌సింగ్ 'ఉపాధి' జ్ఞాపకం

మాజీ పిఎంతో జిల్లాకు అనుబంధం

ప్రజాశక్తి-నార్పల

జిల్లాతో మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్‌తో మరువలేని అనుబంధం ఉంది. దేశంలోనే ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జాతీయ ఉపాధి హామీ పథకాన్ని 2006వ సంవత్సరం ఫిబ్రవరి 2వతేదీన నార్పల మండల పరిధిలోని బండ్లపల్లి గ్రామంలో ప్రధానమంత్రి హోదాలో అప్పటి యుపిఎ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, సిఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి మన్మోహన్‌సింగ్ ప్రారంభించారు. దీంతో అప్పట్లో జాతీయ స్థాయిలో బండ్లపల్లికి గుర్తింపు వచ్చినట్లయింది. ఈ సందర్భంగా బండ్లపల్లి గ్రామంలో స్థానిక నాయకులు, బండ్లపల్లి గ్రామస్తులతో కలిసి మన్మోహన్‌సింగ్ భోజనం చేశారు. ఈ విషయాన్ని బండ్లపల్లివాసులు, నాయకులు గుర్తు చేస్తున్నారు.

ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అన్నేఫెర్రర్

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

ప్రజాశక్తి దినపత్రిక నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆర్‌డిటి సహ వ్యవస్థాపకురాలు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అన్నేఫెర్రర్ శుక్రవారం నగరంలోని కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ ప్రజాశక్తి దినపత్రిక ప్రత్యేకంగా క్యాలెండర్‌ను రూపొందించడం సంతోషకరమన్నారు. ప్రజాశక్తి ఆవిష్కరణలు నిత్యం ప్రజలకు చైతన్య పూరితంగా, మార్గదర్శకంగా ఉంటాయని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రజాశక్తి సిబ్బంది రవిచంద్ర, రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

మడేనహళ్లిలో ఆర్‌ఒ యూనిట్ ప్రారంభం

ఆర్‌ఓ యూనిట్ ప్రారంభిస్తున్న నాయకులు, అధికారులు

డి.హీరేహాల్ : మండల పరిధిలోని మడేనహళ్లి గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆర్‌ఒ యూనిట్‌ను సర్పంచి గంగమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ తెలిపారు. ఎంపిపి 15వ ఫైనాన్స్ నిధుల నుంచి రూ.3.5 లక్షలతో ఆర్‌ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దాస్‌నాయక్, టిడిపి మండల టిడిపి కన్వీనర్ హనుమంతురెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానవాటికల్లో కంపచెట్లు తొలగించాలని వినతి

వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల పరిధిలోని కడవకల్లు గ్రామంలో ఉన్న శ్మశానవాటికలో కంపచెట్లు తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి సూరి కోరారు. ఈమేరకు శుక్రవారం కడవకల్లులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సిపిఎం నాయకులు తహశీల్దార్ శేషారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు ఇళ్లు మంజూరు చేయాలని, గ్రామంలో సైడ్ కాలువలు ఏర్పాటు చేయాలని, శ్మశానవాటికల్లో కంప తొలగించి, ప్రహరీ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వీధిలైట్లు, తాగునీరు కొళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద కూలీలకు రోజుకు రూ.600 కూలి పడేలా చూడాలన్నారు. ఇకపోతే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు జి.వెంకటచౌదరి, జె.పెద్దయ్య, టి.పెద్దయ్య, వి.కుళ్లాయప్ప, కె.నాగభూషణ్, బి.భాస్కర్‌రెడ్డి, టి.ఆదినారాయణ, చిన్న నాగమణి, జె.పెద్దిరాజు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి అమిత్‌షా రాజీనామా చేయాలి

సిపిఎం నాయకుల డిమాండ్

విలేకరులతో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.మల్లికార్జున

ప్రజాశక్తి-రాయదుర్గం

డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై అవమానకరంగా మాట్లాడిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే పదవికి రాజీనామా చేయాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు డి.మల్లికార్జున డిమాండ్ చేశారు. శుక్రవారం రాయదుర్గంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగం ఆధారంగా ఎన్నికైన అమిత్‌షా అంబేద్కర్‌నే అవమానపరిచే రీతిలో మాట్లాడటం తగదన్నారు. దీనికి ప్రధాని మోదీ వెనుకేసుకురావడం విచారకరమన్నారు. అమిత్‌షా చర్యలను వ్యతిరేకిస్తూ ఈనెల 30న దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నాగరాజు, రమేష్, మధు, తిమ్మరాజు, ఎస్‌ఎఫ్‌ఐ నాయకుడు శివ, తదితరులు పాల్గొన్నారు.

డి.హీరేహాల్ : డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలి సిపిఎం పార్టీ కార్యదర్శి లోకేష్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో అంబేద్కర్‌తోపాటు భారత రాజ్యాంగాన్ని ఎగతాళి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. దీనికితోడు అమిత్‌షాకు ప్రధాని వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. వెంటనే బాధ్యత వహించి అమిత్‌షా పదవికి రాజీనామా చేయాలని, లేనిపక్షంలో ఆందోళనలను తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ ఈనెల 30న చేపట్టనున్న దేశవ్యాప్త ఆందోళనలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు బిటిపి ఆయకట్టు సమావేశం

సమావేశంలో మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఆయకట్టు ఛైర్మన్ సుభాన్ అధ్యక్షతన శనివారం నిర్వహించనున్న భైరవానితిప్ప ప్రాజెక్టు ఆయకట్టు సమావేశం నిర్వహించనున్నట్లు టిడిపి మండల కన్వీనర్ శ్రీరాములు తెలిపారు. శుక్రవారం స్థానిక బిటిపి వద్ద ఆయకట్టు వైస్ ఛైర్మర్ సుభాన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆయకట్టు సమావేశానికి విప్ కాలవ శ్రీనివాసులు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. కావున భైరవానితిప్ప ప్రాజెక్టు రైతులు, నియోజకవర్గ ప్రజలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేవంలో టిడిపి రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి కురుగౌడ, కళ్యాణదుర్గం నియోజకవర్గ నాయిబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు నరసింహులు, మాజీ సర్పంచి రామచంద్రప్ప, టీసీ మెంబర్లు శ్రీరామిరెడ్డి, రామ్మూర్తి నాగేంద్ర, నాగేంద్రప్ప, స్కూల్ కమిటీ ఛైర్మన్ పద్మనాభ, వన్నూరుస్వామి, తిప్పేస్వామి, లోకేష్, నాగేంద్ర, మంజునాథ్, వేపులపర్తి ధనుంజయ, శివలింగప్ప, వెంకటేష్ లు, కాలవ ప్రెసిడెంట్ గోవిందు, జెసిబి ఎర్రిస్వామి, బ్రహ్మసముద్రం మాజీ వైస్ సర్పంచి పరమేష్, తదితరులు పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ మృతికి సంతాపం

ఉరవకొండలో మన్మోహన్‌సింగ్‌కు నివాళులర్పిస్తున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి-రాయదుర్గం

ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, గొప్ప దార్శనికుడు భారత మాజీ ప్రధానమంత్రి మన్మోహన్‌సింగ్ మృతి బాధాకరమని విప్ కాలవ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. మన్మోహన్‌సింగ్ లాంటి ఉత్తమ నేతను కోల్పోవడం దేశానికి తీరనిలోటు అన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు.

యాడికి : ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, దేశ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతి తీరనిలోటు అని స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ మేనేజ్‌మెంట్ నాగేంద్ర తెలిపారు. శుక్రవారం స్టార్ ప్యారడైజ్ హైస్కూల్‌లో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ ప్రధాని మృతి భాధాకరమన్నారు. ఆయన మరణం తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో స్టార్ ప్యారడైజ్ హైస్కూల్ ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కుందుర్పి : మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ సేవలు చిరస్మరణీయమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గొల్ల బొజ్జప్ప అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని గౌని తిప్పేస్వామి నివాసంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానిగా, ఆర్థికమంత్రిగా మన్మోహన్‌సింగ్ చేసిన సేవలు మరువలేనివన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఎర్ర రామాంజనేయులు, మారుతి, గోపాల్, బొట్టు ఆంజనేయులు, హనుమంతురాయుడు, సిత్తప్ప, నాగరాజు, రామన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ : భారతదేశ మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్ మతి దేశానికి తీరని లోటని, కాంగ్రెస్ పార్టీ ఒక నిజాయితీగల నాయకుడిని కోల్పోయిందని కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రటరీ సోనియాశీనా,జిల్లా ఉపాధ్యక్షులు బ్యాళ్ల ప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఉరవకొండలోని పార్టీ కార్యాలయంలో మన్మోహన్ సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు.దేశం ఒక మంచి ఆర్థిక వేత్తను కోల్పోయిందని పేర్కొన్నారు. మాజీ ప్రధాని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్బాస్, సోహెబ్, వెంకటరెడ్డి, సుధాకర్, లోకేష్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఉరవకొండ వైసిపి కార్యాలయంలో మన్మోహన్‌సింగ్ చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

ప్రజాశక్తి-నార్పల

అంగన్‌వాడీ కార్యకర్తలు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఐసిడిఎస్ సిడిపిఒ భారతి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పుట్లూరు, యల్లనూరు మండలాల అంగన్వాడీ కార్యకర్తలకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. ప్రీస్కూల్ పని వేళలు పాటించాలని, మెనూ ప్రకారం చిన్నారులకు భోజనం ఇవ్వాలని, గర్భిణులు, బాలింతలకు 6 నుంచి మూడేళ్లలోపు చిన్నారులకు టిహెచ్‌ఆర్ పౌష్టికాహారం అందజేయాలని సూచించారు. మొబైల్ యాప్‌లో సక్రమంగా సమయానికి అప్లోడ్ చేయాలన్నారు. ఈ సమావేశంలో పుట్లూరు సూపర్‌వైజర్ శాంతమ్మ, యల్లనూరు సూపర్‌వైజర్ రాజామణి, అంగన్వాడీలు, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న సిడిపిఒ భారతి

సజావుగా ఉపాధి హామీ ప్రజావేదిక

సమీక్షలో పాల్గొన్న అధికారులు

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయ ఆవరణలో శుక్రవారం నిర్వహించిన ఉపాధి హామీ బహిరంగ సమీక్ష సమావేశం సజావుగా ముగిసింది. 2023 ఏప్రిల్ 1నుంచి 2024 మార్చి 31వతేదీ వరకూ మండల వ్యాప్తంగా జరిగిన పనులపై ప్రజలు, కూలీలకు వివరించారు. ఈ సంవత్సర కాలంలో జరిగిన ఉపాధి పనుల్లో రూ.1.30లక్షలు రికవరీ, రూ.92వేలు అపరాధ రుసుం విధించినట్లు ఉపాధి హామీ ప్రాజెక్టు డైరెక్టర్ సలీంబాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి రమణారెడ్డి, అడిషనల్ పీడీ వాటర్‌షెడ్ సుధాకర్‌రెడ్డి, ఎపిడి అనురాధ, ఎంపిడిఒ గంగావతి, ఎపిఒలు రమేష్, రామారావు, ఎర్రమ్మ, ఓబన్న, లక్ష్మీకాంతాబాయి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఉపాధి హామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

కట్నం వేధింపుల కేసులో జైలు

అనంతపురం క్రైం : కట్నం కోసం వేధించిన కేసులో నిందితునికి సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధించినట్లు త్రీటౌన్ సీఐ కె.శాంతిలాల్ తెలిపారు. సిఐ తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని 5వ రోడ్డుకు చెందిన ముస్రత్ జాన్, ఇస్మాయిల్ బాషా ప్రేమించుకుని పెద్దల సమక్షంలో 2016 సెప్టెంబర్ 1వతేదీన వివాహం చేసుకున్నారు. ముస్రత్ జాన్ పామిడి ఆరోగ్య శాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తోంది. వివాహ సమయంలో భర్త ఇస్మాయిల్ బాషా, అత్త పర్వీన్ బాను, ఆడబిడ్డ ఫరీదాబాను రూ.2.50 లక్షల నగదు, బంగారు చైన్, ఉంగరం కట్నంగా ఇవ్వాలని కోరారు. అయితే తమకు అంత స్థోమత లేదని తెలుపగా వివాహమైన తర్వాత అయినా ఇవ్వాలని పెళ్లి జరిపించారు. వివాహానంతరం వీరంతా కలిసి కట్నం కోసం ముస్రత్ జాన్ ను శారీరకంగా వేధించారు. దీంతో ముస్రత్ జాన్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎఎస్‌ఐ నర్సింహులు కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ టి.వెంకటేశులు (ప్రస్తుతం రూరల్ డీఎస్పీ) సాక్షులను విచారించి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపి చార్జిషీట్ వేశారు. మొబైల్ కోర్టు జడ్జి జె.సుజన్ సాక్షులను విచారించి మొదటి నిందితుడు అయిన ఇస్మాయిల్ బాషాపై నేరం రుజువు అయినందున సంవత్సరం జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మిగిలిన ఇద్దరిపై నేరం రుజువు కానందున వారిపై కేసు కొట్టేశారు. ఈ కేసులో సాక్షులను కోర్టు హెడ్ కానిస్టేబుల్ లక్ష్మీనారాయణ హాజరు పరచగా, ఏపీపీ వి.శ్రీనివాసులు ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

మిలిటరీ మద్యం పట్టివేత

అనంతపురం క్రైం : జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ రామమోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహించి 74 వేర్వేరు రకాల మిలటరీ ఫుల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ ఎం.సత్యనారాయణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు రూరల్ మండలం ఫెర్రర్ నగరంలో దాడులు నిర్వహించి విశ్రాంత ఆర్మీ ఉద్యోగి వడ్డే శ్రీనివాసులు నుంచి 74 బాటిళ్ల వేర్వేరు రకాల మిలిటరీ మద్యం ఫుల్ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మద్యం బాటిళ్లు బెంగళూరు నుంచి తెప్పించి నగరంలో అధిక ధరకు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ మద్యం బాటిళ్లు ఎక్కడి నుంచి ఎవరు సరఫరా చేస్తున్నారన్న దానిపై విచారణ చేస్తున్నామని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐలు జయనరసింహా, జాకీర్‌హుస్సేన్, హెడ్ కానిస్టేబుళ్లు విజయభాస్కర్, శివప్రసాద్, కానిస్టేబుళ్లు రమేష్, కృష్ణానాయక్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

పట్టుబడిన మిలిటరీ మద్యం వివరాలను వెల్లడిస్తున్న సిఐలు

భూ సమస్యల పరిష్కారానికే సదస్సులు

ప్రజాశక్తి-గుత్తి

గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సుల్లో భూసమస్యలను పరిష్కరించుకోవాలని గుంతకల్లు ఆర్‌డిఒ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని కరిడికొండ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే రెవెన్యూ సదస్సులకు మండల అధికారులు వస్తారని, సమస్యలు ఏమైనా ఉన్న అధికారులకు అర్జీ రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం 8 మంది రైతులు వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఓబులేసు, సర్పంచి కె.రమేష్‌బాబు, తొండపాడు ఆలయ ఇఒ కురుబ నాగేంద్రుడు, విఆర్‌ఒలు టి.సురేంద్ర, రంగస్వామి, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని ఆర్‌డిఒ వసంతబాబు తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని కుర్లపల్లిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ


సదస్సులో మాట్లాడుతున్న కళ్యాణదుర్గం ఆర్‌డిఒ వసంతబాబు

రెవెన్యూ సదస్సుల్లో అధికారులు

రెవెన్యూ సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు.

ఉరవకొండ : సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశామని తహశీల్దార్ మహబూబ్‌బాషా తెలిపారు. శుక్రవారం మండలంలోని రాకెట్ల గ్రామంలో రెవిన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అర్జీలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణ, సర్వేయర్లు, వీఆర్వోలు, గ్రామ కార్యదర్శులు, పశ్చిమగోదావరి సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : రెవెన్యూ సదస్సుల్లో భూములకు సంబంధించిన సత్వర పరిష్కారం లభిస్తుందని తహశీల్దార్ ఉపారాణి తెలిపారు. శుక్రవారం పెద్దవడుగూరులో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, పలువురి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ఈకార్యక్రమంలో హెచ్చెల్సీ సాగునీటి సంఘం అధ్యక్షుడు రవిశేఖరరెడ్డి, మండల సర్వేయర్ ప్రసాద్, వీఆర్వోలు అనిల్, రాజేష్, గ్రామ సర్వేయర్ మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

శింగనమల : భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని తహశీల్దార్ సాకే బ్రహ్మయ్య తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని వెస్ట్ నరసాపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా పలువురు సమస్యలపై అర్జీలు అందజేశారు. ఆయా సమస్యలకు త్వరలోనే పరిష్కారం చూపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ నిర్మలాకుమారి, రీసర్వే డిప్యూటీ తహశీల్దార్

సదస్సులో మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్‌డిఒ శ్రీనివాసులు

పునీత్‌కుమార్, మండల సర్వేయర్ స్టీఫెన్ వరకుమార్, వాటర్‌షెడ్ ఛైర్మన్ కృష్ణారెడ్డి, వైస్‌ఛైర్మన్ ఓబుళపతి, నాయకులు పట్నం నగేష్, నారాయణస్వామి, వీరాంజనేయులు, ఓబులేసు, శ్రీనివాసులు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని తంబళ్లపల్లి, పొగరూరు గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ దాదాపు 20 మంది సమస్యలపై వినతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీధర్‌మూర్తి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న శింగనమల తహశీల్దార్ బ్రహ్మయ్య

అంగన్వాడీ సెంటర్‌కు బండలు అందజేస్తున్న తల్లులు

అంగన్వాడీ సెంటర్‌కు గేట్, బండలు వితరణ

పామిడి : స్థానిక దుర్గమ్మ వీధి అంగన్వాడీ కేంద్రం-2కు పలువురు తల్లులు శుక్రవారం గేటుతోపాటు బండలను వితరణ చేశారు. ఈమేరకు అంగన్వాడీ సూపర్‌వైజర్ రామలక్ష్మమ్మ, అంగన్వాడీ టీచర్ జె.ఎల్.నారాయణమ్మ ఆధ్వర్యంలో తల్లులందరూ కలిసి 23 బండలు వితరణ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాయదుర్గం : మండలంలోని 74 ఉడేగోళం వద్ద ఉన్న 132 కెవి సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ సంస్థ అసిస్టెంట్ ఇంజినీర్ బాలచంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో రాయదుర్గం పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలు, గుమ్మగట్ట మండలంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

టిడిపి నాయకుడి మృతికి సంతాపం

ప్రజాశక్తి-గుత్తి

గుండెపోటుతో మృతిచెందిన టిడిపి నాయకుడు కురుబ రవికి పలువురు శుక్రవారం నివాళులర్పించారు. మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్ మోడే శ్రీనివాస్ యాదవ్, టిడిపి మాజీ పట్టణ కన్వీనర్ నరేంద్ర చౌదరి, తెలుగు యువత నాయకుడు కరిడికొండ సుధాకర్ నాయుడు, టౌన్‌బ్యాంకు డైరెక్టర్ కృష్ణ, ధర్మాపురం పులికొండ తదితరులు మృతుడి ఇంటికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని వ్యక్తం చేశారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఉరవకొండ

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యానికి కాపాడుకోవచ్చుని, కావున పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ తెలిపారు. డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉరవకొండలోని పలువార్డుల్లో చేపట్టిన పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. అలాగే రోడ్డుకి ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని సూచించారు. వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి గౌస్ సాహెబ్

విద్యార్థినిని సన్మానిస్తున్న ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్, తదితరులు

అబాకస్ పోటీల విజేతకు సన్మానం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం రూరల్

అబాకాస్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని మేఘనను ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. పట్టణంలోని విద్యానగర్‌లో నివసిస్తూ 7వ తరగతి చదువుతున్న సతీష్, భాగ్యలత దంపతుల కుమార్తె కుమార్తె మేఘన ఢిల్లీలో జరిగిన అబాకాస్ పోటీల్లో 3వ బహుమతి సాధించింది. విషయం తెలుసుకున్న ఇన్ఫినిటీ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దేనాయక్ విద్యార్థినిని అభినందిస్తూ సత్కరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వైస్ ఛైర్మన్ సురేష్, కార్యదర్శి హరీష్, కోశాధికారి అబ్దుల్‌వాహబ్, సభ్యులు తిప్పేస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

31నే పింఛన్ల పంపిణీ

గుత్తి : ఈనెల 31వ తేదీన సామాజిక పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.జబ్బార్‌మియా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒకరోజు ముందుగానే సచివాలయ ఉద్యోగుల ద్వారా పింఛను అందజేస్తామని చెప్పారు. లబ్ధిదారుల అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పామిడి : ఈనెల 31వతేదీనే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపిడిఒ తేజోష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 6 గంటల నుంచే సచివాయల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేయనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని పింఛన్‌దారులు గమణించాలని కోరారు.

రేపు సదస్సు

అనంతపురం : నగరంలోని ఎన్‌జిఒ హోంలో ఈనెల 29న రాయలసీమ సాహిత్యం-బహుజన జీవితం సదస్సు నిర్వహించనున్నట్లు విమలా శాంతి సాహిత్య సాంస్కృతిక సేవా సమితి అధ్యక్షులు శాంతి నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సాహిత్య విమర్శకుడు రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పత్ర సమర్పకులు కొత్తపల్లి సురేష్, పొదిలి నాగరాజు, బావికాటి రాఘవేంద్ర, అంకే శ్రీనివాస్ పాల్గొన్నట్లు తెలిపారు.

వైసిపి పాపమే విద్యుత్ ఛార్జీల పెంపు

టిడిపి ఎమ్మెల్యేలు బండారు శ్రావణిశ్రీ, దగ్గుపాటి

ప్రజాశక్తి-పుట్లూరు

వైసిపి హయాంలో చేసిన పాపం వల్లే విద్యుత్ ఛార్జీల పెంపునకు కారణమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శుక్రవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గతంలో వైసిపి అధికారంలోకి రాగానే నెలరోజుల్లోనే విద్యుత్ ఛార్జీలు పెంచి షాక్ ఇచ్చిన ఘనుడు జగన్ అని గుర్తు చేశారు. 2019లో టిడిపి అధికారం కొల్పేయే నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా అప్పగిస్తే.. అధికారంలోకి వచ్చిన జగన్ పిపిఎలను రద్దు చేయడంతోపాటు, సోలార్, విండ్ పెట్టుబడిదారులను బెదిరించి రాష్ట్రం నుంచి వెళ్లగొట్టారన్నారు. దీంతో రాష్ట్రం 10 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్ కోల్పోవాల్సి వచ్చిందన్నారు. అంతేగాకుండా జెన్‌కో విద్యుత్ ప్లాంట్ల ద్వారా యూనిట్ రూ.5 వచ్చేది వదిలి కమీషన్ల కోసం బహిరంగ మార్కెట్‌లో యూనిట్‌ను రూ.8 నుంచి రూ.14వరకూ కొనుగోలు చేశారన్నారు. పిచ్చి తుగ్లక్‌కు ఏమాత్రం తీసిపోనని జగన్ నిరూపించారన్నారు. ఆయన అనాలోచిత నిర్ణయాలతో గతంలో రాష్ట్రం అధోగతిపాలైందన్నారు. ఇవన్నీ మరిచి ఇప్పుడు వైసిపి నాయకులు ఆందోళనలను చేయడం విడ్డూరంగా ఉందన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి నాయకులు వారి అధినేత జగన్ ఇంటి ముందు ధర్నా చేస్తే బాగుంటుందని హితవు పలికారు.

వైసిపి నాయకులు ధర్నాలు చేయాల్సింది జగన్ ఇంటి వద్దనేలి

అనంతపురం రూరల్ : జగన్ హయాంలోనే విద్యుత్ ఛార్జీల పెంపు నిర్ణయం తీసుకున్నారని అన్నారు. విద్యుత్ ఛార్జీల పెంపుపై వైసిపి చేపట్టిన నిరసనపై శుక్రవారం ఒక ప్రకటనలో ఎమ్మెల్యే దగ్గుపాటి స్పందించారు. జగన్ చేతకానితనం, స్వార్థ ప్రయోజనాలతో తీసుకున్న నిర్ణయాల కారణంగానే నేటి విద్యుత్ ఛార్జీల పెంపు అన్నారు. 2014-19 వరకు ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టారన్నారు. ప్రజలపై ఎలాంటి భారం వేయకుండా చూశారన్నారు. ఆ తర్వాత వచ్చిన జగన్ విద్యుత్ రంగాన్నే దెబ్బతీశారన్నారు. ఆ రోజు ఉన్న పీపీఏలను రివర్స్ టెండరింగ్ పేరుతో రద్దు చేశారన్నారు.

అనంతపురం కలెక్టరేట్ : వైసిపి హయాంలో 9సార్లు విద్యుత్ ఛార్జీల పెంపుతో పాటు ట్రూ అఫ్ చార్జీల పేరుతో రూ.16వేల కోట్లు ప్రజలపై భారం మోపిన ఘనత మాజీ సిఎం జగన్‌కే దక్కుతుందని టిడిపి మైనార్టీ విభాగ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జిరాయతి గౌస్‌మోదీన్ అన్నారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ అరాచక పాలనలో విద్యుత్ రంగాన్ని సర్వనాశనం చేసి ప్రజలపై భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ చేసిన పాపంవల్లే నేడు విద్యుత్ ఛార్జీలు పెంచాల్సి వచ్చిందన్నారు. కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించడానికే వైసిపి ధర్నాలు, ఆందోళనలు చేస్తోందన్నారు. వెంటనే జగన్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.